నాడు అన్యాయం.. నేడు అభయం


సీఎం లేఖలను చూపుతున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


బిట్రగుంట : మహిళలకు ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మహిళలను మోసం చేసిన ఘనుడు బాబు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు అన్యాయం చేస్తే, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో మహిళలకు అభయం ఇస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో రూరల్ నియోజకవర్గంలోని పొదుపు మహిళలకు రూ.16.93 కోట్ల మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా నమూనా చెక్కును ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాలతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు పొదుపు మహిళల బ్యాంక్ బకాయిలను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత వారిని మోసం చేసిన ఘను డు చంద్రబాబు అని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి వరుసగా మూడు సార్లు ఆసరా నగదును జమచేసినట్లు వివరించారు.

మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు – ఎంపీ ఆదాల

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టారని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు.

వేడుకగా..

మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆసరా లేఖలను ఆవిష్కరించారు. మెప్మా వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కార్పొరేటర్‌లు సత్తార్, నాగరాజు, రామ్మోహన్, శ్రీనివాసులురెడ్డి, అవినాష్, రైల్వేబోర్డు మెంబర్ వెంకయ్య, నేతలు పెంచలరెడ్డి, సురేష్, సురేష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాజేష్, ఏసు నాయుడు, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పి.రవి, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

బిట్రగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 750 పొదుపు సంఘాలకు సంబంధించి 7,875 మంది మహిళలకు రూ.5.56 కోట్లకు సంబంధించి మెగా నమూనా చెక్కును ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారతపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పలు పథకాలు అమలు చేసినట్లు వివరించారు.

కన్నతల్లే కడతేర్చింది

- విలాస జీవితానికి ఆశపడి కుమార్తె ఉసురు తీసింది
- పాపను సర్వేపల్లి కాలువలో పడేసి, కిడ్నాప్ కథ అల్లిన వైనం

నెల్లూరు సిటీ : విలాసవంతమైన జీవితం గడిపేందుకు కన్నకూతురు అడ్డుగా ఉందని భావించిన ఓ కసాయి తల్లి ఆ చిన్నారిని కడతేర్చింది. అనంతరం కిడ్నాప్ డ్రామాకు తెరలేపింది. కాగా పోలీసుల విచారణలో అసలు నిజాలు బయటపడ్డాయి. ఈ మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బుధవారం బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో కలుపూటి మణికంఠ, అనూష దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి పెద్ద కూతురు కృతిక, చిన్న కుమార్తె లక్ష్మీ నిహారిక సంతానం. భర్త మణికంఠ రాపూరులో ఓ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు నెల్లూరుకు వచ్చి భార్య, పిల్లలను చూసుకుని వెళ్తుండేవారు. అనూష నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భర్త పలుమార్లు అనూషను రాపూరుకు రావాలని కోరినా, వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

విలాసవంతమైన జీవితం కోసం..

అనూష విలాసవంతమైన జీవితం గడపాలని కోరుకునేది. భర్త మణికంఠకు విడాకులు ఇచ్చేసి పెద్ద కుమార్తె కృతికను తండ్రి వద్ద వదిలేసి, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ గడపాలని ఆశించింది. ఈ క్రమంలో ఏడాదిన్నర వయసున్న చిన్న కుమార్తె తనకు అడ్డుగా ఉందని భావించి చంపేయాలని నిర్ణయించుకుంది. తల్లిదండ్రులు వెంకటగిరికి వెళ్లిన సమయంలో ఈనెల 3వ తేదీ రాత్రి ఇంట్లో ఊయాలలో నిద్రిస్తున్న చిన్న కుమార్తె లక్ష్మీ నిహారికను ఇంటి వెనుక ఉన్న సర్వేపల్లి కాలువలో పడేసింది. మరుసటి రోజు ఏమీ తెలియనట్లు కిడ్నాప్ డ్రామాకు తెరతీసింది. ఊయాలలో నిద్రిస్తున్న కుమార్తెను కిడ్నాప్ చేశారంటూ రోదించింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా కన్నతల్లి చేసిన ఘాతుకం బయటపడింది. సర్వేపల్లి కాలువలో పడేసిన బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. నిందితురాలిని అరెస్ట్ చేశారు.

సోమశిలలో 53.776 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 53.776 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 362 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.984 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 330 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

క్లుప్తంగా

1,243 పొగాకు బేళ్ల విక్రయం


వేలంలో విక్రయించిన పొగాకు బేళ్లు

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 760 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 785 బేళ్లు రాగా వాటిలో 760 బేళ్లను విక్రయించామని వివరించారు. మిగిలిన 25 బేళ్లలో 15 నోసేల్, 9 నోబిడ్, 1 సీఆర్‌గా గుర్తించామన్నారు. వేలంలో 1,05,028 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.2,06,77,249ల వ్యాపారం జరిగింది. గరిష్ఠ ధర కిలో ఒక్కటింటికి రూ.200లు కాగా కనిష్ఠ ధర రూ.183 లభించింది. మొత్తం మీద సగటు కిలో రూ.196.87గా నమోదైంది. వేలంలో ఎనిమిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరిలో..

కలిగిరి : కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 483 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 526 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 483 బేళ్లను కొనుగోలు చేశారని, 43 బేళ్లను తిరస్కరించారని తెలియజేశారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.170, సగటున రూ.189.05 ధర లభించింది. వేలంలో ఆరు కంపెనీలు పాల్గొన్నాయి.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 118
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 192
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి


'జగనన్నే మా భవిష్యత్తు : మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్


కోవూరు : మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అంటిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- ఎమ్మెల్యేలు అనిల్, ప్రసన్న వెల్లడి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : అన్నివర్గాలకు అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతామని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. నగరంలోని విజయమహల్ గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో జగనన్నే మా భవిష్యత్తు : మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 7 నుంచి 20వ తేదీ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న పనులను వివరిస్తామన్నారు. గత టీడీపీ కాలంలో మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు కూడా వెచ్చించలేదన్నారు. తమ ప్రభుత్వంలో రూ.40 కోట్లను మున్సిపల్ పాఠశాలలకు ఖర్చు చేశామన్నారు. నగరంలో 25 పార్కులు నిర్మించామన్నారు. నెల్లూరులో శిథిలావస్థలో ఉన్న 8 అర్బన్ హెల్త్ సెంటర్లను పునర్నిర్మించడంతో పాటు అదనంగా మరో ఎనిమిది సెంటర్లను రూ.24 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. గతంలో నెల్లూరుకు నారాయణ రూ.115 కోట్ల అప్పు తీసుకొచ్చాడే తప్ప గ్రాంటు రూపంలో ఏమైనా తెచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు..

కోవూరు : ప్రజలకు మరింత చేరువయ్యేందుకు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ఉపయోగపడుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పడుగుపాడు గ్రామ పంచాయతీ ఈ కార్యక్రమానికి ఆయన బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతిరోజు 30 నుంచి 50 ఇళ్లను సందర్శించాలన్నారు. కుటుంబ యజమాని అనుమతితో జగనన్న స్టిక్కర్‌ను అంటించి జగనన్న పాలనకు మద్దతు తెలిపేలా ఒక ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేధింపులపై భార్య ఫిర్యాదు

నెల్లూరు సిటీ: భర్త వేధింపులపై సంతపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ట్రంక్‌రోడ్డులోని ఏటీ అగ్రహారంలో నివాసం ఉంటున్న బలరామిరెడ్డి, సుజాతకు 40 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం వేధింపులు మరింత ఎక్కువకావడంతో పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నెల్లూరు సిటీ: పేకాట స్థావరంపై వేదాయపాళెం పోలీసులు దాడులు చేశారు. వివరాలు.. బీవీనగర్‌లోని రాజు కాంప్లెక్స్ వద్ద పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టారు. పేకాటాడుతున్న ఆరుగుర్ని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.14,500ను స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు : వ్యాపారాల్లో అప్పులపాలై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలం కరటంపాడులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు.. కరటంపాడు గ్రామానికి చెందిన మార్తు సుధాకర్ (59) పలు వ్యాపారాలు నిర్వహించి అప్పుల పాలయ్యాడు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సైతం సిమెంట్ వరల వ్యాపారం పెట్టి నష్టపోయాడు. దీనికితోడు ఇటీవల డీసీపల్లి గ్రామంలో సుధాకర్ నిర్వహిస్తున్న షామియానాల సప్లయర్స్ దుకాణం సైతం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఆర్థికంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం గ్రామంలోని తన పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

నెల్లూరు సిటీ: యువతి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కటారిపాళెంలో నివసిస్తున్న దామోదర్ చిన్న కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తన స్నేహితురాలితో కలిసి బజార్‌కు వెళ్తున్నానని సోమ వారం చెప్పింది. దామోదర్ తన పెద్ద కుమార్తెతో కలిసి బయటకెళ్లి రాత్రి పది గంటలకు ఇంటికొచ్చారు. అ ప్పటికీ చిన్న కుమార్తె ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా, తాను వస్తున్నానని చెప్పింది. అయినా ఇంటి కి రాకపోవడంతో కాల్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్క ల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వేణుగోపాలుడికి గరుడసేవ



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మోహినీ అలంకారం, గరుడ సేవను బుధవారం జరిపారు. ఉభయకర్తలుగా సత్యనారాయణశర్మ, ఇందుమతి, శేషారెడ్డి, గిరిజ దంపతులు వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రావు, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రమౌళిరెడ్డి పర్యవేక్షించారు.

ముగిసిన పంగున్యుత్తర ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పంగున్యుత్తర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. రంగనాథుడు, రంగనాయకి అమ్మవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి పర్యవేక్షించారు.

గజవాహనంపై అనంత కోదండరాముడు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గజవాహనసేవను జరిపారు. ఉభయకర్తలుగా నారాయణ, హైమావతి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, మస్తాన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

కోదండరాముడికి గరుడసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవను నిర్వహించారు. అనంతరం నగరోత్సవాన్ని కనులపండువగా జరిపారు. స్వామి వారు మోహినీ ఉత్సవంలో ఉదయం కటాక్షించారు. మహిళల కోలాట ప్రదర్శన, విష్ణుశ్వర నృత్యనికేతన్, వైష్ణవి శిష్యబృంద ఆధ్వర్యంలో జానపద నృత్యాలను ప్రదర్శించారు.

కోదండరాముడికి హనుమంతసేవ

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో పల్లకిసేవ, హనుమంతసేవను నిర్వహించారు. ఈఓ దర్గయ్య ధర్మకర్తల మండలి చైర్మన్ రమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.

భ్రమరాంబ మల్లేశ్వరుడికి నందిసేవ



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నందిసేవను జరిపారు. ఉభయకర్తగా అనిల్‌కుమార్ వ్యవహరించారు. ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా ఆంజనేయుడి రథోత్సవం



నెల్లూరు(బృందావనం): సంతపేటలో కొలువైన ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. ఆంజనేయస్వామి వారు సర్వాలంకార శోభితంగా రథంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. తొలుత నిత్యహోమం, మహానివేదన, బలిహరణ, పుణ్యాహవచనం, స్వస్తివచనం, రథకుంభప్రోక్షణ, తదితర పూజలను ఆలయ ప్రధానార్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన రథోత్సవం దేవస్థానానికి మధ్యాహ్నం ఒంటి గంటకు చేరింది. ఉభయకర్తగా ఈశ్వర్ వ్యవహరించారు. శీతల పానీయాలు, మజ్జిగ, ప్రసాదాలను పలువురు పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వెంకటమునిసుధీర్, దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈఓ దర్గయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలందేలా చర్యలు



వృద్ధురాలిని పలకరిస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అర్హులకు సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు చేపడుతున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని నాలుగో డివిజన్లో గల మారుతి నగర్ 1, 2వ వీధులు, రామ్‌నగర్, న్యూ కాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకాలు అందకపోతే అందుకు గల కారణాలను తెలుసుకొని వారికి వర్తించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని చెప్పారు. కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ చైర్ వితరణ



నెల్లూరు (అర్బన్): నగరంలోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల ట్రస్ట్‌కు రూ.మూడు లక్షల విలువైన డెంటల్ చైర్, పరికరాలను కోమిట్ల బస్ సర్వీసెస్ అధినేత రెనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ దాతృత్వంతో బుధవారం అందజేశారు. తన తండ్రి సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ఈ మొత్తాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేశ్వరరావుకు రెనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. భవిష్యత్తులో మరింత సాయం చేస్తామని చెప్పారు. డాక్టర్లు పద్మావతి, అనీష్, సుబ్రహ్మణ్యం, ఆడిటర్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలకు వినతి



బాధితురాలిని పరామర్శిస్తున్న ఐద్వా నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): అప్పు చెల్లించలేదనే కారణంతో మహిళపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను బుధవారం పరామర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. చాటగొట్లకు చెందిన మహిళ అప్పు చెల్లించలేదనే కారణంతో ప్రభాకర్, ప్రమీలమ్మ దంపతులు దాడి చేసి గాయపర్చడం దుర్మార్గమన్నారు. నేతలు పద్మ, షంషాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని బుధవారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమాన్ని జరిపారు. ఉభయకర్తలుగా ప్రవీణ్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకుడు నందకిషోర్ పర్యవేక్షించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



నెల్లూరు రూరల్: కుట్టుతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని పలువురు పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీఆర్వో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 103 మంది మహిళలకు సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పీటర్ దానియెల్, వేళంగణిరాజు, పీటర్ బోస్కో, పాల్‌రాజు, డాక్టర్లు లలిత, రాకేష్, విశ్రాంత ఇరిగేషన్ అధికారి శ్రీనివాసులురెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

భవనానికి స్థలాన్ని కేటాయించరూ..



నెల్లూరు (అర్బన్): జగ్జీవన్‌రామ్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ భవన్ స్టడీ సర్కిల్‌కు వేరే ప్రాంతంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో పాత భవన స్థలాన్ని కేటాయించాలని కోరారు. అనంతరం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. నేతలు రమేష్, మధు, శేషయ్య పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు సిటీ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మన్సూర్‌నగర్‌లో షానవాజ్ (42), ఆరిఫా దంపతులు నివసిస్తున్నారు. నగరపాలక సంస్థలో వాటర్ సప్లయర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.15 లక్షల అప్పు చేసి కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు. ఎప్పటికి అప్పులు తీరుస్తానోనని ఆందోళన చెందారు. ఈ క్రమంలో ఇంటి నుంచి మంగళవారం బయటకొచ్చిన ఆయన భోజనానికి రాలేదు. పలుమార్లు భార్య ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయలేదు. రాజీవ్ గృహకల్ప సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద వాంతులు చేసుకుంటున్నారని ఆరిఫాకు స్థానికులు తెలియజేశారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని చూడగా, గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారని తేలింది. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందుల అందజేత



నెల్లూరు (అర్బన్): హరనాథపురంలోని కాలువ గట్టుపై నివాసం ఉంటున్న హుస్సేన్‌బాషా, శాంతి దంపతుల కుమార్తె అమూల్య దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న తరుణంలో నెలకు సరిపడా మందులను విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. నగరానికి చెందిన నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య కుసుమ, కుమారుడు కిరణ్‌కుమార్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వీరవెంకటసత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యుడు, కార్యక్రమ పర్యవేక్షకుడు భాస్కరశర్మ, ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీ రిజర్వేషన్లను ఎత్తేయడం తగదు'

నెల్లూరు (వేదాయపాళెం): కర్ణాటకలో మైనార్టీలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను ఎత్తేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర నేతలు చంద్రమౌళి, సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య, రామరాజు, సిరాజ్, సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శ్రీనివాసులు, అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, తదితరులు పాల్గొన్నారు,.

చలివేంద్రాల ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో చలివేంద్రాలను బయ్యా వెంకటరమణయ్య, సరోజ నమ్మ, శుభమస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శ్రీనివాసులు, వెంకటరవికుమార్, శ్రీనివాస రాణాప్రతాప్ బుధవారం మాట్లాడారు. చిన్నబజార్‌లోని న్యూ రాజ్యలక్ష్మి హాల్, వీఆర్సీ సెంటర్ సమీపంలోని శుభమస్తు షాపింగ్ మాల్, మూడో మైల్లోని వేర్ హౌస్ సెంటర్లలో వంద రోజుల పాటు వీటిని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్



నెల్లూరు (అర్బన్) : సమసమాజ స్థాపన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు వెంకటయ్య, ఏపీ ఎంఐపీ పీడీ శ్రీనివాసులు, దళిత సంఘాల నేతలు మురళి, సుబ్బారావు, బాలచెన్నయ్య, ప్రసన్న గణపతి, సుబ్బయ్య, వెంకటయ్య, మోహన్ అంబేడ్కర్, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మన భవిష్యత్తు'ను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈ నెల ఏడు నుంచి చేపట్టనున్న జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, గృహ సారథులు విజయవంతం చేయాలని ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని తన నివాసంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమ విజయవంతానికి అందరూ సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి పరామర్శ



నెల్లూరు(సెంట్రల్): ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో గాయపడి నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డక్కిలి ఎస్సై నాగరాజును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

వంతెన నిర్మించాలంటూ నిరసన

నెల్లూరు రూరల్: పొట్టేపాళెం వద్ద గల కలుజుపై వంతెనను నిర్మించాలంటూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో పలువురు నిరసనను బుధవారం చేపట్టారు. కలుజు వద్ద రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయన చెప్పారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



బీసీ నేతల ఆధ్వర్యంలో..



ఏపీ ఎన్జీఓస్ ఆధ్వర్యంలో..



బీటీఏ ఆధ్వర్యంలో..

నెల్లూరు(వేదాయపాళెం): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని వేదాయపాళెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

• బీసీ నేతలు రఘురామ్ ముదిరాజ్, రమణయ్యగౌడ్, అరిగెల సాయి, కిష్టయ్య, ఎమ్మార్పీఎస్ నేతలు సుబ్బయ్య, శ్రీనివాసులు, పెంచలయ్య, రమేష్, రవికుమార్, ప్రభాకర్, చరణ్, తదితరులు నివాళులర్పించారు.

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కామరాజు నివాళులర్పించారు.

నెల్లూరు (అర్బన్): వేదాయపాళెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు ఆంజనేయవర్మ, నేతలు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, విజయ్‌కుమార్, మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): కిమ్స్ ఆస్పత్రి సమీపంలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బీటీఏ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బీటీఏ వ్యవస్థాపకుడు రమణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి రఘు, నేతలు కొండయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(పొగతోట): జెడ్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో..

• డ్వామా పీడీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పీడీ వెంకట్రావు నివాళులర్పించారు.

ఘన నివాళి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఎమ్మీఎస్ కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్

ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధన నేడు

నెల్లూరు(బృందావనం): ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఆరు నుంచి నిర్వహించనున్నామని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ కార్యదర్శి అరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని చర్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఇండియన్ ఎవలాంజికల్ మిషన్ నేషనల్ సెక్రటరీ జెన్ని క్రిస్టఫర్ వాక్యోపదేశం చేయనున్నారని చెప్పారు. అనంతరం వివిధ సంఘ కాపరులు, నేతలతో ఐక్య ప్రభురాత్రి భోజన సంస్కార ఆరాధనను నిర్వహించనున్నామని వివరించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): శబరిమలవాసుడి వార్షిక జయంతి ఉత్సవాన్ని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. గణపతి హోమం, అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, మహాహారతిని విశేషంగా జరిపారు. సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జగన్నాథం, మురళీమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. శాలువా కప్పి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసినందుకు గానూ కృతజ్ఞతలను తెలియజేశారు.